ఉపాధి హామీ చట్టాన్ని పట్టణాలకు విస్తరించాలి

- పల్లెల్లో 200 రోజులు పని కల్పించాలి
- ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్. పుణ్యవతి
- మహిళలపై హింసకు పాల్పడుతున్న దోషులకు కేంద్రం అండ
- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధి హామీ చట్టాన్ని పట్టణ ప్రాంతాల్లో అమలు చేసి 200 రోజులు పనిదినాలు కల్పించాలని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ సమావేశాలు రెండు రోజులుగా యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట పట్టణ కేంద్రంలోని మున్నూరు కాపు సత్రంలో నిర్వహించారు. సమావేశం అనంతరం మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో పుణ్యవతి మాట్లాడుతూ.. పేదలకు ఉపాధి లేక అల్లాడుతుంటే.. కేంద్ర ప్రభుత్వం వారిపై భారాలు వేస్తూ అదానీ, అంబానీలకు దోచిపెట్టడంపై ఐద్వా ఆధ్వర్యంలో రాబోయే కాలంలో ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. 2014లో 69వ స్థానంలో ఉన్న అదానీ ప్రపంచ కుబేరుల్లో 2వ స్థానానికి వెళ్లటానికి మోడీ ప్రభుత్వం అనుసరించిన విధానమే కారణమన్నారు. పేదల నుంచి కుబేర్లకు దోచిపెడుతున్న విధానాలపై వివిధ భాషలో పుస్తకాలు ప్రచురించి దేశవ్యాప్తంగా క్యాంపెయిన్ చేయబోతున్నామని, అనంతరం అక్టోబర్ 5న ఢిల్లీలో భారీ సభ నిర్వహిస్తామని తెలిపారు. ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. మహిళల ఆహారం, వస్త్రధారణపై ఆంక్షలు పెడుతూ మనువాద భావజాలాన్ని అమలు చేస్తూ మహిళలపై హింసకు పాల్పడుతున్న దోషులకు కేంద్ర ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. మహిళల హక్కులు హరించే విధానాలకు వ్యతిరేకంగా మహిళలను చైతన్యం చేసేందుకు రాష్ట్ర కమిటీలో కార్యాచరణ రూపొందించుకున్నామని తెలిపారు.

ఉపాధి హామీ, డ్వాక్రా సమస్యలపై సర్వే చేసి, ప్రజల నుంచి వచ్చిన సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు ఇవ్వడంతోపాటు అవసరమైతే ఆందోళనలు నిర్వహిస్తామని చెప్పారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు అరుణ జ్యోతి, ఉపాధ్యక్షులు బి.హైమావతి, కేఎన్ ఆశాలత, యాదాద్రి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు అవ్వారి రామేశ్వరి, బట్టుపల్లి అనురాధ, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే బిఆర్ఎస్‌కి కొండంత అండ

మంత్రులు తలసాని, ఎర్రబెల్లి, మల్లారెడ్డి..

చేతనైతే నాపై పోటీ చేయ్.. : రేణుకకు మంత్రి పువ్వాడ సవాల్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయిల్లో నిర్వహిస్తున్న బిఆర్ఎస్ 23వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, ఆత్మీయ సమ్మేళనాల్లో మంగళవారం మంత్రులు పాల్గొని పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ప్రతిపక్ష పార్టీలపై ఆరోపణలు, వారు చేసిన వ్యాఖ్యలపై సవాళ్లు విసిరారు. హైదరాబాద్‌లోని ఆర్‌టిసి కళ్యాణ మండపంలో, సికింద్రాబాద్‌లోని మహబూబా కాలేజీలోని ఎస్‌విఐటి ఆడిటోరియంలో నిర్వహించిన ముషీరాబాద్, సనత్ నగర్ నియోజకవర్గాల బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సమావేశంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. కార్యకర్తలే బిఆర్ఎస్ పార్టీకి కొండంత అండ అన్నారు. ఎమ్మెల్యే ముఠా గోపాల్ పాల్గొన్నారు. బిఆర్ఎస్ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రతినిధుల సభ తూంకుంటలోని జాన్వీ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. కేంద్ర సర్కారు ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టి మత రాజకీయాలు చేస్తోందని, చైతన్యవంతమైన తెలంగాణలో బిజెపి నేతల పప్పులు ఉడకవని అన్నారు.

అభివృద్ధి సంక్షేమంలో తెలంగాణ దేశానికే ఆదర్శం : మంత్రి ఎర్రబెల్లి

జనగామ జిల్లా పాలకుర్తిలో నిర్వహించిన వేడుకల్లో పార్టీ గ్రామ అధ్యక్షులు బిఆర్ఎస్ జండాను ఆవిష్కరించారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమంలో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. పాలకుర్తి ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేస్తున్నామని, పాలకుర్తి, వల్మిడి, బొమ్మెర గ్రామాలను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాలోని ఆర్తీ గార్డెన్స్‌లో నిర్వహించిన బిఆర్ఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, మహబూబాబాద్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్‌తో ఎంపీ, జిల్లా అధ్యక్షులు మాలోతు కవిత పాల్గొని మాట్లాడారు.

'చేతనైతే నాపై పోటీ చేయ్..' రేణుకకు మంత్రి పువ్వాడ సవాల్

ప్రత్యర్థుల పాలిట సింహస్వప్నంలా మారబట్టే తనను ఎదుర్కోలేక వ్యక్తిగత దూషణకు దిగుతున్నారని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. 'అరేయ్.. తురేయ్.. వాడు.. వీడు' అంటూ సభ్యత మరిచి వ్యవహరిస్తున్నారన్నారు. తూలనాడటం.. వ్యక్తిగత దూషణ తమకు చేతకాక కాదన్నారు. ఖమ్మం నగరంలోని మమత మెడికల్ కళాశాల గ్రౌండ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ ప్రతినిధుల సభలో పువ్వాడ మాట్లాడారు. ఎమ్మెల్యేగా తన తొమ్మిదేండ్ల పదవీకాలంలో అభివృద్ధి చేయడం కోసం కష్టపడ్డ కాని.. ప్రజల దగ్గర డబ్బులు వసూలు చేసిన చరిత్ర తనకు లేదన్నారు. టిక్కెట్ ఇప్పిస్తాననే పేరుతో గిరిజనుల వద్ద రూ.కోట్లు దోచి.. వారి ప్రాణాలు హరించిన చరిత్ర రేణుకాచౌదరిదని విమర్శించారు. కేంద్ర మంత్రిగా, ఎంపీగా ఖమ్మానికి చేసిన ఓ మంచి పనైనా చెప్పగలరా? అని ప్రశ్నించారు. దమ్ముంటే రేణుకాచౌదరి తనపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో ఎంపీలు నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర పాల్గొన్నారు.

దుర్భరంగా వలస కార్మికుల బతుకులు

సిడబ్ల్యుఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వలస కార్మికులు ఎవ్వరికీ పట్టనోళ్లుగా మారారనీ, వారి బతుకులు దుర్భరంగా ఉన్నాయని సిడబ్ల్యుఎఫ్ఐ అఖిల భారత ఉపాధ్యక్షులు ఎం.సాయిబాబు అన్నారు. వలస కార్మికుల చట్టాల నూ పాలకులు, యజమానులు బుట్టదాఖలు చేస్తు న్నారని విమర్శించారు. ఆ చట్టాలను పకడ్బంధీగా అమలు చేసేందుకు సిఐటియు పోరాడుతున్నదని చెప్పారు. మంగళవారం హైదరాబాద్‌లోని సుందర య్య విజ్ఞాన కేంద్రంలో భవన నిర్మాణ రంగ వలస కార్మికుల రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎం.సాయిబాబు మాట్లాడుతూ... వలస కార్మికులు రోజుకు 14 నుంచి 16 గంటలు పనిచేస్తున్నారనీ, వారికి ఎక్కడ కూడా కనీస వేతనాలు అమలు కావడం లేదని చెప్పారు. వారికి సామాజిక భద్రత కరువైందన్నారు. అటు సొంత ప్రాంతంలోనూ, ఇటు పని ప్రదేశంలోనూ ఆధార్, రేషన్, ఓటర్ కార్డులు లేక వారు అవస్థలు పడుతున్న తీరును వివరించారు. ప్రతి పౌరునికీ దేశంలో ఎక్కడైనా స్వేచ్ఛగా జీవించే హక్కు ఉంటుందని ఆర్టికల్ 19(1) చెబుతుంటే...వలస కార్మికులు మాత్రం పనిప్రదేశాల్లో తీవ్ర వివక్షకు, అణచివేతకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒక్కో రూమ్‌లో ఏడెనిమిది మంది వలస కార్మికులను యాజమాన్యాలు, దళారులు కుక్కి ఉంచుతున్న దైన్యస్థితిని వివరించారు. 1979 అంతర్ రాష్ట్ర వలస కార్మికుల చట్టం ప్రకారం వలస కార్మికుల పేర్లను రిజిష్టర్‌లో నమోదు చేయాలనీ, వారికి పునరావాసం, సమాన పనికి సమాన వేతనం, పిల్లలకు విద్యా,వైద్య సౌకర్యాలు, రానుపోను ప్రయాణ చార్జీలు, తదితర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. అయితే, ఇందులో ఏ ఒక్కటి కూడా అమలు కావడం లేదని వాపోయారు. ఇప్పటివరకు అమలులో ఉన్న అంతర్‌రాష్ట్ర వలస కార్మిక చట్టాన్ని అక్యుపేషనల్ సేఫ్టీ హెల్త్, వర్క్ కండిషన్ కోడ్‌లోకి మార్చిందన్నారు. దీంతో ఆ చట్టం రద్దయిపోయిందని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం వలస కార్మికుల పేర్లను కార్మిక శాఖ నమోదు చేయాలనీ, రిజిస్ట్రర్లను తప్పనిసరిగా మెయింటెన్ చేయాలని డిమాండ్ చేశారు. వారికి రేషన్, గుర్తింపు కార్డులను ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ భవన, ఇతర నిర్మాణ రంగ కార్మికుల ఫెడరేషన్ గౌరవాధ్య క్షులు వంగూరు రాములు, ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.రామ్మోహన్‌రావు, రత్నాకరం కోటంరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ ముదాం శ్రీనివాసరావు, రాష్ట్రనాయకులు లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఎల్లుండి నుంచి రెన్యూవబుల్ ఎనర్జీ ఎక్స్‌పో

హైదరాబాద్ : నగరంలోని హైటెక్స్‌లో ఏప్రిల్ 28, 29 తేదిల్లో రెన్యూవబుల్ ఎనర్జీ ట్రేడ్ ఎక్స్‌పోను నిర్వహించనున్నారు. రెండు రోజుల పాటు సాగనున్న ఈ రెన్యూఎక్స్7వ ఎడిషన్‌లో డిసిఆర్ మాడ్యూల్స్ మోనోఫేషియల్, బైఫేషియల్ వేరియంట్‌లు అందుబాటులో ఉంటాయని గోల్డి సోలార్ గ్లోబల్ హెడ్ హర్దీప్ సింగ్ పేర్కొన్నారు. పవర్ అవుట్‌పుట్ 520 డబ్ల్యుపి నుండి 550 డబ్ల్యుపి వరకు డిసిఆర్ మాడ్యుల్స్ ఉంటాయని.. ఇవి నివాస, ప్రభుత్వ ప్రాజెక్టులకు అనువైనవని తెలిపారు.

తగ్గుతోన్న డాలర్ వాడకం

- ప్రత్యామ్నాయాలపై చైనా దృష్టి
- ఎల్ఎన్‌జి కోసం యుఎఇతో జట్టు

షాంగై : ప్రపంచ వ్యాప్తంగా డాలర్ వాడకంలో తగ్గుదల చోటు చేసుకుంటుంది. వాణిజ్యంలో అమెరికన్ డాలర్ కాకుండా ఇతర అనుకూలమైన కరెన్సీల వినియోగంపై అనేక దేశాలు దృష్టి పెడుతున్నాయి. చైనా, ఇతర దేశాలు సరిహద్దు వాణిజ్యం కోసం స్థానిక కరెన్సీలను ఉపయోగించడం ద్వారా డాలర్‌పై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తున్నాయని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మల్టీపోలార్ అంతర్జాతీయ కరెన్సీ వ్యవస్థను రూపొందించడంపై దృష్టి పెడుతున్నాయని భావిస్తున్నారు. ఈ ఏడాది మార్చి చివరలో షాంఘై పెట్రోలియం అండ్ నేచురల్ గ్యాస్ ఎక్సేంజ్ చైనా యువాన్‌ను ఉపయోగించి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ నుండి సహజ వాయువును దిగుమతి చేసుకుంది. లిక్విఫైడ్ న్యాచురల్ గ్యాస్ (ఎల్ఎన్‌జి) రెండో అతిపెద్ద దిగుమతిదారుగా ఉన్న చైనా తొలిసారి తన సొంత కరెన్సీని దీనికి వాడటం విశేషం. ప్రపంచ వస్తువుల వాణిజ్యంలో చాలా కాలంగా డాలర్ ఆధిపత్యం కొనసాగుతోన్న విషయం తెలిసిందే.

చమురు ఎగుమతి చేసే దేశాలు అంతర్జాతీయ స్థాయిలో డాలర్ కంటే యువాన్ వంటి కరెన్సీలను ఉపయోగించేందుకు ఆసక్తి చూపుతున్నాయని యుఎఇ ఎల్ఎన్‌జి ఒప్పందంతో తేలిందని స్విట్జర్లాండ్‌లోని ఫ్రిబోర్గ్ విశ్వవిద్యాలయంలోని స్థూల ఆర్థిక, ద్రవ్య ఆర్థిక శాస్త్ర ప్రొఫెసర్ సెర్గియో రోస్సీ పేర్కొన్నారు. 'యుఎఇ-చైనా లావాదేవీల్లో డాలర్ నుండి వారి స్వంత కరెన్సీలకు మారడం ద్వారా ఇతర దేశాలను ప్రోత్సహిస్తుంది. దీని ద్వారా వాణిజ్య లేదా ఆర్థిక మార్కెట్లలో విదేశీ లావాదేవీలను పరిష్కరించవచ్చు.' అని రోస్సీ తెలిపారు. దీర్ఘకాల ఎల్ఎన్‌జి విక్రయం, కొనుగోలు ఒప్పందాల నేపథ్యంలో సమీప భవిష్యత్తులో మరిన్ని యువాన్ ఆధిపత్య లావాదేవీలు జరిగే అవకాశం ఉందని అంతర్జాతీయ న్యాయ సంస్థ కింగ్ అండ్ వుడ్ మల్లేసన్స్‌లో భాగస్వామి అయినా డేవిడ్ ఫువా పేర్కొన్నారు. మలేషియాతో భారత ద్వైపాక్షిక వాణిజ్యం ఇక రూపాయల్లో జరుగనుందని జనవరి తొలి వారంలో భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇప్పటికే రష్యా, మారిషాస్, శ్రీలంక దేశాలతో ఎగుమతులు, దిగుమతుల లావాదేవీలు రూపాయల్లో జరుగుతున్నాయి. తాజాగా ఈ జాబితాలో మలేషియా వచ్చి చేరింది. ఇప్పుడు మలేషియాతో వాణిజ్యం ప్రస్తుతమున్న కరెన్సీలతో పాటు రూపాయల్లోనూ జరగనుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. వాణిజ్య లోటును ఎదుర్కోవడానికి ప్రపంచంలోని అనేక దేశాలు ఈ తరహా విధానాన్ని అనుసరించడానికి ప్రయత్నాలు చేస్తున్నాయి.

మహీంద్రా నుంచి బొలెరో మాక్స్ పికప్ శ్రేణి

హైదరాబాద్ : మహీంద్రా అండ్ మహీంద్రా (ఎంఅండ్ఎం) పికప్ బ్రాండ్ బొలెరోలో కొత్తగా మాక్స్ శ్రేణిని ఆవిష్కరించింది. మంగళవారం హైదరాబాద్‌లో వీటిని ఆ కంపెనీ సౌత్ జోనల్ హెడ్ అరునంగ్షు లాంచనంగా మార్కెట్లోకి విడుదల చేశారు. మాక్స్ శ్రేణి నూతన మైలురాళ్లను సృష్టించనుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. కొత్త శ్రేణి అధిక పేలోడ్ సామర్థ్యం, మెరుగైన మైలేజ్ , పనితీరు, ఉత్తమ సౌకర్యం, భద్రత, అత్యంత విశ్వసనీయ, సమర్థవంతమైన రవాణా పరిష్కారాన్ని అందిస్తుందన్నారు. కనీసం రూ.24,999 డౌన్ పేమెంట్‌తో దీన్ని బుక్ చేసుకోవచ్చన్నారు. ఆకర్షణీయమైన ఫైనాన్సింగ్ పథకాలను కూడా అందిస్తోన్నామన్నారు. వీటి ధరల శ్రేణిని రూ.7.85 లక్షల నుంచి రూ.10.33 లక్షలుగా నిర్ణయించింది.

నేటినుంచి డివైఎఫ్ఐ జాతీయ సమావేశాలు

ఎస్‌వికెలో 28 వరకు నిర్వహణ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జాతీయ సమావేశాలు బుధవారం నుంచి మూడురోజులపాటు హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం (ఎస్‌వికె)లో జరగనున్నాయి. మంగళవారం డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, అనగంటి వెంకటేష్ ఒక ప్రకటన విడుదల చేశారు. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి యువజన సంఘం నాయకులు హాజరవుతారని తెలిపారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ మహాసభలో చర్చిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణీత గడువులోపు వేసిన నోటిఫికేషన్లన్నింటికీ ఉద్యోగాలు భర్తీ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ బషీర్, తిరుపతి, శివవర్మ, మల్లం మహేష్, సహాయ కార్యదర్శులు జావేద్, పెద్ది సూరి, కృష్ణ నాయక్, కిరణ్, యంగ్ ఉమెన్స్ కన్వీనర్ రోషిని ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర ఫేక్ కరెన్సీ ముఠా గుట్టురట్టు

13 మందిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నకిలీ కరెన్సీ చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను సైబరాబాద్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. మొత్తం 13 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.30.68 లక్షల నకిలీ కరెన్సీ, రూ.60 వేల నగదు, 13 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసుకు సంబంధించిన వివరాలను రంగారెడ్డి జిల్లా సైబరాబాద్‌లోని సిపి కార్యాలయంలో సిపి స్టీఫెన్ రవీందర్ మీడియాకు వెల్లడించారు. నకిలీ నోట్ల తయారీకి సంబంధించిన విషయంపై పోలీసులకు రెండు నెలల కిందట ఫిర్యాదు అందడంతో పోలీసులు విచారణ చేపట్టారు. ప్రధానంగా 13 మంది సభ్యులు ఉన్న ఈ ముఠా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు కేంద్రాలుగా చేసుకొని దందా నడిపిస్తున్నారు. 500 నోట్లను జిరాక్స్ ప్రింటింగ్ ద్వారా ప్రింట్ తీసి సాయంత్రం వేళలో ఈ నోట్లను మార్చేవారు. నోట్ల మార్పిడికి ప్రధానంగా చిన్న, మధ్యతరగతి షాప్స్, స్ట్రీట్ వేడర్స్ వారిని లక్ష్యంగా చేసుకొని మార్కెట్లోకి తీసుకొచ్చారు. వీరిలో కొంతమంది బల్క్ డబ్బును కూడా లక్ష రూపాయలు ఒరిజినల్ కరెన్సీ ఇస్తే ఐదు లక్షలు ఫేక్ కరెన్సీని మారుస్తున్నారు. హైదరాబాద్, సైబరాబాద్ కమిషరేట్ పరిధిలో సాయంత్రం వేళలో నడుస్తున్న షాప్స్ ప్రధానంగా చేసుకోవడం, అమాయక ప్రజలు వీటిని గుర్తించడంలో లోపాలని లక్ష్యంగా చేసుకొని ఈ కరెన్సీ పెద్ద ఎత్తున చలామణి చేశారు. రాజస్థాన్‌కు చెందిన కొంటె రాజేష్, త్రిపురకు చెందిన నెలదాస్ ఈ ఇద్దరు మిగతా కొంతమందిని అనుచరులుగా ఏర్పాటు చేసుకొని ఈ నకిలీ కరెన్సీ దందాను సాగించారు. రెండు రోజుల కిందట రాజేష్ ఓ హోటల్ రూమ్‌ను ఖాళీ చేస్తూ నకిలీ కరెన్సీ ఇచ్చాడు. ఆ హోటల్ సూపర్‌వైజర్‌కు అనుమానం వచ్చి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రాజేశ్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతన్ని విచారించగా మిగతా సభ్యుల వివరాలు చెప్పడంతో వారిని మంగళవారం అరెస్టు చేశారు. ప్రజలంతా నకిలీ నోట్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని ముఖ్యంగా సాయంత్రం పూట వ్యాపారం చేసే వ్యక్తులు ఇలాంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సిపి సూచించారు. సమావేశంలో ఎస్‌ఓటీ ఎసిపి శ్యాంబాబు, ఎస్‌టీఎఫ్, క్రైమ్ డిసిపి కలమేశ్వర్, మాదాపూర్ డిసిపి శిల్పావళి, ఆంజనేయులు, రాజగోపాల్ రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మే 31 నుంచి అంబేద్కర్ వర్సిటీ డిగ్రీ పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం (బిఆర్ఏఓయూ) డిగ్రీ మూడు, రెండు, మొదటి సంవత్సరం (పాత బ్యాచ్) 2016, అంతకు ముందు బ్యాచ్ విద్యార్థులకు వచ్చేనెల 31 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి పి వెంకట రమణ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. డిగ్రీ మూడో సంవత్సరం పరీక్షలు వచ్చేనెల 31 నుంచి జూన్ ఐదో తేదీ వరకు, రెండో సంవత్సరం పరీక్షలు జూన్ ఏడు నుంచి 14వ తేదీ వరకు, మొదటి సంవత్సరం పరీక్షలు అదేనెల 16 నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తామని తెలిపారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ వచ్చేనెల పదో తేదీ వరకు ఉందని తెలిపారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు విశ్వవిద్యాలయ పోర్టల్ www.braouonline.in లో నమోదు చేసుకోవాలని సూచించారు. పరీక్ష ఫీజును టీఎస్/ఏపీ ఆన్‌లైన్ సెంటర్ల ద్వారా డెబిట్, క్రెడిట్ కార్డుతో మాత్రమే చెల్లించాలని కోరారు.

భారతీయ సనాతన ధర్మ సారథి ఆదిశంకరాచార్య

అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి



ప్రజాశక్తి-కల్చరల్

భారతీయ సనాతన ధర్మ సారధి అది శంకరాచార్య అని, ఆయన వేద భాష్యాలు పరమ ప్రమాణీకమని రాష్ట్ర అధికార భాషా సంఘం చైర్మన్ మంత్రి శ్రీదేవి అన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళా వేదికపై గాన సభ నిర్వహణలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయులు యాదిలో కార్యక్రమంలో భాగంగా ఆదిశంకరులు జయంతి ఉత్సవం మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా శ్రీదేవి పాల్గొని సమాజంలో అకృత్యాలు, అనాచారాలు విలయతాండవం చేస్తునన సందర్భంలో శంకరుని అవతార పురుషునిగా అది శంకరాచార్య ఆవిర్భావం జరిగిందన్నారు. ఆయన కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు కాలి నడకన పర్యటించి శంకరస్తకం, కనక ధారా స్రోత్రం వంటి పలు దేవతల ప్రార్థనా శ్లోకాలను తన పన్నెండేళ్ల వయస్సులోనే అందించిన అది గురువు అని ఆమె వివరించారు. అధ్యక్షత వహించిన గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి మాట్లాడుతూ ఆది శంకరాచార్య దేశం నాలుగు ప్రాంతాలలో నాలుగు పీఠాలు సనాతన ధర్మ పరిరక్షణకు స్థాపించారని, ఆ పీఠంలో ఒకటైన శృంగేరి పీఠ అధిపతి నియంత్రణలో ఉనన జ్ఞాన సరస్వతి దేవాలయానికి తాను ధర్మాధికారి కావడం జన్మసుకృతం అని అన్నారు. దేవీ ప్రసాద్ మాట్లాడుతూ సర్వ జీవులలోనూ ఆత్మ ఒక్కటే అని, బేధాలు లేవన్న అది శంకరుని మార్గం అనుసరణీయం అన్నారు. బాల సాహిత్య రచయిత చొక్కాపు రమణ పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్‌కు సాటి మరొకరులేరు

జస్టిస్ రామలింగేశ్వరరావు

ప్రజాశక్తి-కల్చరల్

సినీ రంగంలోనైన, రాజకీయ రంగంలోనైనా ఎన్‌టిఆర్‌కు సాటి ఎన్‌టిఆరేనని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎ. రామలింగేశ్వర రావు అన్నారు. రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో యువకళావాహిని సాంస్కృతిక సంస్థ నిర్వహణలో నందమూరి తారకరామారావు శత జయంతి సభ మంగళవారం జరిగింది. ముఖ్య అతిథిగా జస్టిస్ రామలింగేశ్వరరావు పాల్గొని ఎన్‌టిఆర్ పురస్కారాలను నటి కవిత, దర్శకుడు నిట్టల గోపాలకృష్ణ, రచయిత నవీన్‌లకు బహూకరించి మాట్లాడారు. తెలుగుజాతి ఖ్యాతి ప్రతిష్ట ఎన్‌టిఆర్ అని, అలాంటి వ్యక్తి ఈ శతాబ్దిలో వేరొకరు ఉండరని అన్నారు. కళా పోషకుడు సారిపల్లి కొండలరావు అధ్యక్షత వహించిన సభలో సాంస్కృక శాఖ సంచాలకుడు డాక్టర్ మామిడి హరికృష్ణ, గీత రచయిత డాక్టర్ వడ్డేపల్లి కృష్ణ, నటుడు భాగి శాస్త్రీ తదితరులు పాల్గొన్నారు. సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీనారాయణ స్వాగతం పలుకుతూ సాంస్కృతిక శాఖ తమ కార్యక్రమానికి సౌజన్యం అందించారని ధన్యవాదాలు తెలిపారు

పాలిసెట్‌కు 1.06 లక్షల దరఖాస్తులు

ఆలస్య రుసుంతో మే 14 వరకు సమర్పణకు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో పాలిటెక్నిక్, వివిధ డిప్లొమా కోర్సుల్లో 2023-24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించే పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (పాలిసెట్)కు 1,06,561 దరఖాస్తులొచ్చాయి. ఈ మేరకు రాష్ట్ర సాంకేతిక విద్యా శిక్షణా మండలి (ఎస్‌బీటీఈటీ) కార్యదర్శి డాక్టర్ సి శ్రీనాథ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. వారిలో 98,831 మంది అభ్యర్థులు ఫీజు చెల్లించారని తెలిపారు. ఆలస్య రుసుం రూ.200తో వచ్చేనెల 14వ తేదీ వరకు దరఖాస్తులను సమర్పించేందుకు అవకాశముందని సూచించారు. పదో తరగతి పరీక్షలు రాసిన వారు, ఇప్పటికే పాసైన విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని తెలిపారు. పాలిసెట్ రాతపరీక్షను వచ్చేనెల 17న నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్ష నిర్వహించిన పది రోజుల్లో ఫలితాలు విడుదల చేస్తామని వివరించారు. అభ్యర్థులు ఇతర వివరాల కోసం polycet.sbtet.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అకాల వర్షంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. ఖమ్మం రూరల్ మండలంలోని గోళ్లపాడు, పొన్నెకల్లు గ్రామాల్లో మంగళవారం తమ్మినేని పర్యటించి తడిసిన ధాన్యాన్ని, నష్టపోయిన పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటలు నష్టపోయిన రైతులకు ఎకరానికి మామిడి తోటలకు రూ.50 వేలు, వరి పంటకు 30 వేలు, మొక్కజొన్న రైతులకు ఎకరానికి రూ.50 వేలు నష్టపరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ విషయమై ముఖ్యమంత్రి కెసిఆర్‌ను స్వయంగా కలిసి రైతుల బాధలను వివరిస్తానన్నారు. ఆయన వెంట రైతు సంఘం నాయకులు బండి రమేష్, ఉరడీ సుదర్శన్ రెడ్డి, నంద్ర ప్రసాద్, తోట పెద్ద వెంకట రెడ్డి తదితరులు ఉన్నారు.

యువకుడి దారుణ హత్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రేమ పేరుతో యువతిని తరచూ వేధించడంతోపాటు.. ఆమె వివాహబంధం విచ్ఛిన్నమవ్వడానికి కారణమైన యువకుడిని బాధిత కుటుంబ సభ్యులు దారుణంగా కొట్టి చంపారు. ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా జైపూర్ మండలం ఇందారం గ్రామంలోని గంగపుత్ర కాలనీలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ముష్కె మహేష్(25) అదే గ్రామానికి చెందిన యువతిని ప్రేమ పేరుతో వేధించేవాడు. విషయం తెలియడంతో యువతికి తల్లిదండ్రులు మరో వ్యక్తితో వివాహం చేశారు. ఆ తర్వాత కూడా యువకుడు వెంటపడుతూ వేధించాడు. అది తెలిసిన ఆమె భర్త విడాకులు ఇవ్వడంతోపాటు, ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం యువతి తల్లిదండ్రుల వద్దే ఉంటోంది. తమ కూతురు జీవితం ఆగం కావడానికి కారణమైన యువకున్ని తల్లిదండ్రులు, సోదరుడు కలిసి అతన్ని పట్టుకున్ని కొట్టారు. తలపై రాయితో మోదడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. జైపూర్ ఏసీపీ నరేందర్, శ్రీరాంపూర్ సీఐ రాజు సంఘటన స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలను పరిశీలించారు. విచారణ చేపట్టి, నిందితులకు కఠిన శిక్ష పడేలా చూస్తామని తెలిపారు.

30న నాలుగు పరీక్షలు

వేర్వేరు తేదీల్లో నిర్వహించాలి : ఎఐఎస్ఎఫ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఈనెల 30న ఒకేరోజు నాలుగు పరీక్షలను నిర్వహిస్తున్నారని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠరెడ్డి, కార్యదర్శి పుట్ట లక్ష్మణ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కానిస్టేబుల్, కమ్యూనికేషన్ కానిస్టేబుల్, అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), జూనియర్ లైన్‌మెన్ (జేఎల్ఎం) పరీక్షలను ఒకే రోజు నిర్వహించడం సరైంది కాదని పేర్కొన్నారు. ఇది నిరుద్యోగుల జీవితాలతో రాష్ట్ర ప్రభుత్వం చెలగాటమాడడమేనని విమర్శించారు. ఒకే రోజు కాకుండా వేర్వేరు తేదీల్లో ఆయా పరీక్షలను నిర్వహించాలని కోరారు. నిరుద్యోగులు ఇబ్బందులు పడకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఆర్టిజన్ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ రంగంలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. సమస్యల పరిష్కారం కోసం మంగళవారం నుంచి తలపెట్టిన సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ మేరకు ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సమ్మెకు సంఘీభావంగా అన్ని జిల్లాల్లో ఐఎఫ్‌టీయూ, దాని అనుబంధ శ్రేణులు కార్యక్రమాల్లో పాల్గొనాలని కోరారు. విద్యుత్ రంగంలోని ఆర్టిజన్ కార్మికులకు శాశ్వత ఉద్యోగులకు వర్తించే అన్ని నిబంధనలను వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. వారికి ఏపీఎస్ఈబీ నిబంధనలను అమలు చేయాలని తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న స్టాండింగ్ నిబంధనలను రద్దు చేయాలని పేర్కొన్నారు. ఆర్టిజన్లకు పర్సనల్ బేసిక్‌లో డీఏ కలిపి ఫిట్‌మెంట్ ఇవ్వాలని సూచించారు.

మహారాజశ్రీ 9వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు మరియు ఫ్యామిలీ కోర్టు రాజమహేంద్రవరం

M.V.O.P.No. 38/2018

Between:
Ande Seetha Mahalakshmi
Ande Srinivasu
Ande Suribabu
Ande Adinarayana
...Petitioners
AND
K.Jnaneswar and Others
...Respondents

Respondent No-1:
K.Jnaneswar, S/o. Arjayya, Hindu, aged 45 Years, Driver of the APSRTC Garuda Plus Volvo Bus, Bearing No. AP 29 Z 2918, R/o. D.No. 10-26, Kalikanagar, Mandalaganda, Rangareddy Dist., Rangareddy Dist. Court DMC.

పై నెంబరు పిటీషనులో 1వ రెస్పాండెంటు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు /నోటీసులు పంపినా మీరు వాటిని ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్ప వేయుచున్నారు. కావున **ది.05-05-2023 సం॥రం తేదీ ఉదయం గం॥10:30 ని॥లకు మీరు స్వయంగా గాని లేదా ప్లీడరు ద్వారా గాని హాజరు అయ్యి సదరు పై పిటీషనులో మీ అక్షేపణలను తెలుపుకొనవలెను.** లేని ఎడల సదరు పిటీషను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.

(శ్రీకోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

రాజమండ్రి,
25-4-2023.

వై.రామకృష్ణరావు
అడ్వకేట్,రాజమండ్రి

తొమ్మిది ఇసి కేంద్రాలకు ఓలా విస్తరణ

హైదరాబాద్ : విద్యుత్ వాహన కంపెనీ అయిన ఓలా ఎలక్ట్రిక్ కొత్తగా హైదరాబాద్‌లో రెండు ఎక్స్‌పీరియన్స్ సెంటర్ల (ఇసి)ను తెరిచినట్లు ప్రకటించింది. దేశ వ్యాప్త విస్తరణలో భాగంగా వీటిని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. శంషాబాద్, ఎఎస్ రావు నగర్‌లో కొత్త అవుట్‌లెట్‌లను ఏర్పాటు చేయడం ద్వారా నగరంలో వీటి సంఖ్య తొమ్మిదికి చేరినట్లు వెల్లడించింది. ఈ స్టోర్లలో ఇవి ఉత్పత్తులను ప్రదర్శన, అమ్మకానికి ఉంచుతోంది.

అలెక్సాతో కమ్యూనికేషన్ నైపుణ్యాలు వృద్ధి

హైదరాబాద్ : ఇంటిలో అలెక్సా వాడటం వల్ల భారత్‌లో తమ పిల్లల కమ్యూనికేషన్ నైపుణ్యాలు పెరుగుతున్నాయని 95 శాతం మంది తల్లిదండ్రులు అభిప్రాయపడినట్లు తమ సర్వేలో వెల్లడైందని కాంటార్ పేర్కొంది. తమ చిన్నారులు ఆంగ్ల భాష మాట్లాడటం, చక్కటి విలువలను ఆచరించడం, సామాజిక పద్ధతులు తెలుసుకోవడం, నృత్యం, గానం, సంగీత వాయిద్యాలను వాయించడం తదితర వాటిలో ప్రావీణ్యం పొందాలని తల్లిదండ్రులు కోరుకుంటున్నారని అమెజాన్ కోసం మార్చి 2023లో కాంటార్ నిర్వహించిన అధ్యయనంలో తేలిందని పేర్కొంది. పది నగరాల్లో 3-8 ఏళ్ల లోపు పిల్లలు కలిగిన 750 మంది తల్లిదండ్రులపై ఈ సర్వే చేసినట్లు పేర్కొంది.

హయర్ నుంచి క్యుఎల్ఇడి గూగుల్ టివి

హైదరాబాద్ : గృహోపకరణాల సంస్థ హయర్ తాజాగా గూగుల్‌తో కలిసి క్యుఎల్ఇడి సీరిస్ టివిలను ఆవిష్కరించినట్లు ప్రకటించింది. హయర్ అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో, పరిశ్రమలోనే అత్యుత్తమ పిక్చర్ నాణ్యతతో ఈ విభాగంలోకి ప్రవేశించామని, ఇది ఆవిష్కరణ, రూపకల్పన, స్మార్ట్ సాంకేతిక నైపుణ్యాల సంపూర్ణ సమ్మేళనమని హయర్ అప్లయెన్సెస్ ఇండియా అధ్యక్షుడు సతీష్ ఎన్ఎస్ పేర్కొన్నారు. దీని ధరను రూ.69,999గా నిర్ణయించినట్లు తెలిపారు.

పిడుగుపాటుకు పది ఆవులు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నో ఏళ్లుగా పశువుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న ఆ ఆదివాసీ కుటుంబాలకు పిడుగులు తీరని నష్టం చేకూర్చాయి. పది ఆవులు, ఎద్దులు మృత్యువాత పడ్డాయి. వివరాల్లోకి వెళితే.. ములుగు జిల్లా తాడ్వాయి మండలంలోని దట్టమైన అడవి ప్రాంతంలో ఉన్న లింగాల ఏజెన్సీలో మంగళవారం సాయంత్రం గాలి దుమారం లేచింది. ఉరుములు మెరుపులతో పిడుగు పడింది. చాపల సుధాకర్ అనే గిరిజన రైతుకు చెందిన ఏడు, చాపల కాంతారావుకు చెందిన మూడు కలిపి మొత్తం 10 ఆవులు, ఎద్దులు అక్కడికక్కడే మృత్యువాతపడ్డాయి. రెండు కుటుంబాలకు సుమారు నాలుగు లక్షల 50 వేల రూపాయల నష్టం జరిగింది. సర్పంచ్ ఊకే మౌనిక నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదివాసీ గిరిజన రైతులకు సహాయం అందించాలని కోరారు.

రాహుల్‌గాంధీకి అభినందనలు

- కాంగ్రెస్ ఒబిసి సమావేశంలో విహెచ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బిసి గణన చేస్తామంటూ హామీ ఇచ్చిన ఎఐసిసి అగ్రనేత రాహుల్‌గాంధీకి కాంగ్రెస్ ఒబిసి నేతలు అభినందనలు తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని ఇందిరాభవన్‌లో మాజీ ఎంపి వి. హనుమంతరావు అధ్యక్షతన ఒబిసి నేతలు పొన్నాల లక్ష్మయ్య, జి. నిరంజన్, సంగిశెట్టి జగదీష్, లక్ష్మణ్ యాదవ్, రాజ్ ఠాకూర్, నగేష్ ముదిరాజ్, నూతి శ్రీకాంత్, సునీతారావు, మెట్టు సాయికుమార్, శ్రీకాంత్ తదితరులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విహెచ్ మాట్లాడుతూ కులగణన చేపట్టాలనీ, వారికి బిసి రిజర్వేషన్లు పెంచాలంటూ రాహుల్‌గాంధీ డిమాండ్ చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మోడీ ప్రధాన మంత్రి అయ్యాక స్వయంగా తాను ఒబిసి అని ప్రకటించుకున్నారనీ, అయినా వారికి న్యాయం జరగలేదని విమర్శించారు.

బిజెపి విధానాలతో దేశం సర్వనాశనం

- బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిజెపి ప్రభుత్వ విధానాలతో దేశం సర్వనాశనం అయిందని మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అన్నారు. దేశంలోనే తెలంగాణను అభివృద్ధికి చిరునామాగా చేసిన కెసిఆర్ నాయకత్వం దేశానికి అనివార్యమైందని స్పష్టం చేశారు. మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా బిఆర్ఎస్ ఆవిర్భావ సభలు నిర్వహించారు. అందులో భాగంగా సిరిసిల్ల నియోజకవర్గ స్థాయి ప్లీనరీ, పార్టీ ఆవిర్భావ సభ సిరిసిల్ల పురపాలక పరిధి అపెరల్ పార్కు వద్ద నిర్వహించారు. మంత్రి పార్టీ జెండా ఆవిష్కరించి అమరవీరుల స్థూపానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సాధించాక రెండుసార్లు ముఖ్యమంత్రిగా కెసిఆర్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో దేశంలోనే అగ్రగామిగా నిలబెట్టారని చెప్పారు. దేశాన్ని అభివృద్ధి దిశలో తీసుకుపోవాలంటే కెసిఆర్ లాంటి దమ్మున్న నాయకుడు కావాలన్నారు. మహారాష్ట్రలో కెసిఆర్ బహిరంగ సభలు పెడితే రైతులు, ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, రానున్న రోజుల్లో ఈ ఉద్యమం దేశవ్యాప్తంగా ఉధృతం అవుతుందన్నారు. 2010 నుంచి 2014 వరకు గుజరాత్ రాష్ట్రంలో జరగని అభివృద్ధిని జరిగినట్టు ప్రచారం చేసుకొని నరేంద్ర మోడీ ప్రధానమంత్రి అయ్యారని ఎద్దేవా చేశారు. బ్రెయిన్ లేని బంటి.. పార్టీలు మారే సంటీలు తెలంగాణ రాష్ట్రంలో ప్రతిపక్ష పార్టీల అధ్యక్షులు అయ్యారని.. ఇది రాష్ట్రానికి పట్టిన దరిద్రమన్నారు. రాష్ట్రంలో అన్ని కులాలు, మతాల వారు సంతోషంగా ఉన్నారని చెప్పారు. రాష్ట్ర సచివాలయానికి అంబేద్కర్ పేరు పెట్టడం వల్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేశారన్నారు. ఇది ఎన్నికల సంవత్సరమని చిన్న పాము అయినా పెద్దకట్టెతో కొట్టాలని కార్యకర్తలకు సూచించారు. ఆద మరచి ఉండకూడదని, అలర్ట్‌గా ఉండాలని కరీంనగర్ పార్లమెంటు సీటును ఈసారి వదులుకునే పరిస్థితి లేదని.. ఎంపీగా బోయినిపల్లి వినోద్‌కుమార్‌ను గెలిపించాలని సూచించారు. మతం పేరు మీద విచిత్ర రాజకీయాలు చేస్తున్న ఎంపి బండి సంజయ్‌తో ప్రజలు ఇబ్బంది పడుతున్నారని.. ఇలాంటి వ్యక్తిని గెలిపించుకున్నామా అని ఎవరికి వారు ప్రశ్నించుకుంటూ మనోవేదన చెందుతున్నారని అన్నారు.

కార్యకర్తలే కొండంత అండ : మంత్రి తలసాని

కార్యకర్తలే బిఆర్ఎస్‌కు కొండంత అండ అని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సికింద్రాబాద్‌లోని మహబూబ్ కాలేజీలోని ఎస్‌వీఐటీ ఆడిటోరియంలో నిర్వహించిన సనత్‌నగర్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముషీరాబాద్ నియోజకవర్గ ఆత్మీయ సమ్మేళనాన్ని బాగ్‌లింగంపల్లిలోని ఆర్‌టిసి కళ్యాణ మండపంలో నిర్వహించారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరయ్యారు. బిఆర్ఎస్ మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ ప్రతినిధుల సభలో మంత్రి మల్లారెడ్డి పాల్గొన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలో గల బీఆర్ఎస్ కార్యాలయంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పార్టీ జెండాను ఆవిష్కరించారు. మహబూబాబాద్ జిల్లాలోని ఆర్తి గార్డెన్‌లో బిఆర్ఎస్ ప్లీనరీ సమావేశంలో ఎంపీ, బీఆర్ఎస్ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు మాలోతు కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

కూలీల ఆటో బోల్తా

- ఇద్దరు మహిళలు మృతి
- 13 మందికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రెక్కాడితే డొక్క నిండని నిరుపేద కుటుంబాల కూలీలు మరో ప్రాంతానికి పనికి వెళుతుండగా ఆటో బోల్తా పడింది. 50 కిలో మీటర్ల దూరంలో జూలూరుపాడుకు వెళ్తుండగా మార్గమధ్యలో ఏన్కూరు వద్ద రోడ్డు ప్రమాదానికి గురై ఇద్దరు కూలీలు ప్రాణాలు కోల్పోయారు. 13 మందికి గాయలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ఖమ్మ జిల్లా కల్లూరు పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన మహిళా కూలీలు ప్రతి రోజూ జూలూరుపాడు, ఏన్కూరు మండలాల్లో మిరపకాయ ఏరేందుకు వెళ్తున్నారు. రోజు మాదిరిగానే మంగళవారం ఉదయం 5 గంటలకు 14 మంది ఆటోలో బయలుదేరగా.. ఏన్కూర్ పెట్రోల్ బంక్‌లో నుంచి బయటకు వస్తున్న సమయంలో కొత్తగూడెం వైపు నుంచి వస్తున్న కారు లారీని ఓవర్ టేక్ చేయబోయి ఆటోను ఢీకొట్టింది. దాంతో ఆటో నుజ్జునుజ్జు అయింది. ఆటోలో ఉన్న డ్రైవర్ సహా కూలీలందరికీ గాయాలయ్యాయి. వీరిని ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. వేము వరమ్మ (40), బీరవెల్లి వెంకటమ్మ (45) చికిత్స పొందుతూ మృతిచెందారు. మేకల సువార్త పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ తరలించారు. డ్రైవర్ నాగరాజు పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉంది. మిగిలిన వారికి కాళ్లు, చేతులు విరిగాయి. సత్తుపల్లి శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య ప్రభుత్వ ఆస్పత్రి ఎస్ఓ వెంకటేశ్వరరావుకు ఫోన్ చేసి కూలీలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. కల్లూరు ఎంపిపి బీరవల్లి రఘు, రైతు సమితి జిల్లా మండల ప్రతినిధులు పసుమర్తి చంద్రరావు, లక్కినేని రఘు, మేకల కృష్ణ, వెంకటరత్నం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి చేరుకొని పరిశీలించారు. బాధితులను ఓదార్చారు.

ప్రవేశ పరీక్షల హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలి

- బిసి గురుకుల కార్యదర్శి డాక్టర్ మల్లయ్య భట్టు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి గురుకులాల్లో ఇంటర్, డిగ్రీ కోర్సుల ప్రవేశ పరీక్షకు వెబ్ సైట్ నుంచి విద్యార్థులు హాల్ టికెట్లను డౌన్ లోడ్ చేసుకోవచ్చని మహాత్మా జ్యోతిభా పూలే గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి డాక్టర్ మల్లయ్యభట్టు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిసి గురుకుల విద్యాసంస్థల http://mjpt-bcwreis.telangana.gov.in వెబ్‌సైట్ ద్వారా హాల్‌టికెట్లను డౌన్లోడ్ చేసుకోవాలని ఆయన సూచించారు. ఏప్రిల్ 30న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్ష జరగనున్నదని తెలిపారు. అరగంట ముందే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా 277 కేంద్రాల్లో పరీక్ష నిర్వహిస్తున్నామనీ, సంబధిత ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఏమైనా సందేహాలు ఉంటే 040 - 23328266, 23322377 నంబర్లను సంప్రదించాలని మల్లయ్య భట్టు సూచించారు.

సమస్యల తీవ్రత వల్లే...

రైతులు ఇతర రంగాల వైపు పోతున్నారు

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదే బాధ్యత
- తెలంగాణ రైతు సంఘం సమావేశంలో సారంపల్లి, సాగర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

వ్యవసాయ రంగంలో నెలకొన్న సమస్యల తీవ్రత వల్లే రైతులు ఇతర రంగాల వైపు పోతున్నారని తెలంగాణ రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్ ఆవేదన వ్యక్తం చేశారు. అందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే బాధ్యత వహించాలని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా మల్లారెడ్డి, సాగర్ మాట్లాడుతూ రైతుల సమస్యలు పరిష్కరిస్తామంటూ హామీలిస్తున్న పాలకులు అధికారంలోకి రాగానే వాటిని మరిచిపోతున్నారని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక చేసిన అప్పులు తీరక రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతేడాది దేశవ్యాప్తంగా 12,600 మందికి పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని తెలిపారు. వారి కోసం అనేక పథకాలు అమలు చేస్తున్నామనీ, బీమా సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పే ప్రభుత్వాలు రైతుల ఆత్మహత్యలను ఎందుకు నివారించలేకపోతున్నాయని ప్రశ్నించారు. పాత అప్పుల కింద బ్యాంకులు రైతులకిచ్చే రుణాలు జమకట్టుకుంటున్నాయని చెప్పారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు ప్రయివేటు వ్యాపారుల దగ్గర అధిక వడ్డీలకు అప్పులు తీసుకుంటున్నారని గుర్తు చేశారు. విత్తనాలు, పురుగుమందుల్లో కల్తీ, రసాయనిక ఎరువుల ధరలపై ఇచ్చే సబ్సిడీలు ఎత్తేయడం మూలంగా రైతులపై అధిక ధరల భారం పడుతున్నదని చెప్పారు. అన్ని రంగాల్లో కార్పొరేట్లు చొరబడినట్టుగానే వ్యవసాయ రంగాన్ని కూడా ఆయా కంపెనీలకు కట్టబెట్టేందుకే కేంద్ర సర్కారు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకొచ్చిందన్నారు. రైతు ప్రతిఘటనను చూసి విధిలేని పరిస్థితుల్లో ఆ చట్టాలను రద్దు చేసిందన్నారు. రైతులకు అన్ని రకాల విత్తనాలు, ఎరువులను, పనిముట్లను ప్రభుత్వమే సబ్సిడీపై అందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నంద్యాల నర్సింహారెడ్డి, జూలకంటి రంగారెడ్డి, ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు, పి.జంగారెడ్డి, వీరేపల్లి వెంకటేశ్వర్లు, మాదినేని రమేష్, బుర్రి శ్రీరాములు, సహాయ కార్యదర్శులు మూడ్ శోభన్, కందాల ప్రమీల, బొంతు రాంబాబు, కున్‌రెడ్డి నాగిరెడ్డి, డి.బాల్‌రెడ్డి, అన్నవరపు సత్యనారాయణ, మాటూరి బాలరాజు గౌడ్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, ఎండీ గఫూర్, పల్లపు వెంకటేష్ తదితరులు ఉన్నారు.

ఏటా రెండు కోట్ల ఉద్యోగాలేవీ..?

- కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.2 లక్షల రుణమాఫీ
- సిఎల్‌పి నేత భట్టి విక్రమార్క

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యేటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామని ప్రధాని మోడీ చేసిన ప్రకటన గురించి బిజెపి రాష్ట్ర అధ్యక్షులు బండి సంజయ్ మాట్లాడకుండా అధికారంలోకి రాగానే తెలంగాణలో 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని మాట్లాడటం విడ్డూరమని సిఎల్‌పి నేత మల్లు భట్టి విక్రమార్క అన్నారు. హన్మకొండ జిల్లాలో పీపుల్స్ మార్చ్ పాదయాత్రలో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం జిఎస్‌టిని తీసుకొచ్చి సామాన్యులు బతికే పరిస్థితి లేకుండా చేసిందన్నారు. ప్రతి ఒక్కరి ఖాతాలో వేస్తామన్న రూ.15 లక్షలు, నోట్ల రద్దుతో వెలికితీస్తామన్న నల్లధనం ఏమైందని ప్రశ్నించారు. మార్కెట్‌లో నిత్యావసర సరుకుల కృత్రిమ కొరతను సృష్టించి ధరలు పెంచి అమ్ముకునే విధంగా అంబానీ, అదానీలకు ప్రధాని మోడీ అవకాశం కల్పిస్తున్నారన్నారు. అదానీ ఆర్థిక నేరాన్ని గుట్టురట్టు చేసిన హిండేన్ బర్గ్ సంస్థ ఇచ్చిన నివేదిక గురించి ప్రశ్నించిన రాహుల్ గాంధీని పార్లమెంటుకు రాకుండా కేంద్ర ప్రభుత్వం చేసిన కుట్రలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనన్నారు. కమిషన్ వేసి కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు శాతం ముస్లిం మైనార్టీలకు రిజర్వేషన్లను కల్పించగా, తెలంగాణలో దాన్ని 12 శాతానికి పెంచిన కేసీఆర్.. దాన్ని రద్దు చేస్తామన్న అమిత్‌షా వ్యాఖ్యాలను సీఎం ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఇవ్వకపోయినప్పటికీ వందలసార్లు ఢిల్లీకి వెళ్లిన సీఎం కేసీఆర్ మనకు రావాల్సిన హక్కులను అడగకుండా స్వార్థ రాజకీయాల కోసం రాష్ట్ర పునర్విభజన హక్కులను పణంగా పెడుతున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రభుత్వం వెంటనే బిసిలకు సబ్‌ప్లాన్ చట్టం తీసుకురావాలని కోరారు. వరంగల్‌ను స్మార్ట్ సిటీగా ప్రకటించినప్పటికీ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉందన్నారు. గ్రీన్ ఫీల్డ్ హైవేలో 3 వేల ఎకరాలు కోల్పోతున్న నిర్వాసితులకు 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఒకే దఫా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని ప్రకటించారు. టెక్స్‌టైల్స్ పార్క్‌లో భూములు కోల్పోయిన నిర్వాసితులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. రూ.500లకే గ్యాస్ సిలిండర్‌ను పంపిణీ, నిరుపేదలు సొంత స్థలంలో ఇల్లు నిర్మించుకుంటే రూ.5 లక్షలు ఇస్తామని తెలిపారు. సమావేశంలో హన్మకొండ డిసిసి అధ్యక్షులు నాయిని రాజేందర్‌రెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, టిపిసిసి ఉపాధ్యక్షులు, వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బి. శోభారాణి, మాజీ ఎమ్మెల్యే వేం నరేందర్‌రెడ్డి, మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు లేని ప్రయివేటు వర్సిటీలపై చర్యలు

- ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గుర్తింపు లేని ప్రయివేటు విశ్వవిద్యాలయాల పేరుతో ప్రచారం చేస్తూ, పరీక్షలు నిర్వహిస్తున్న గురునానక్, శ్రీనిధి వంటి సంస్థలపై చర్యలు తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, కార్యదర్శి టి నాగరాజు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అనుమతులు రాకున్నా ప్రయివేటు విశ్వవిద్యాలయాల పేరుతో లక్షల రూపాయలను విద్యార్థుల నుంచి వసూళ్లు చేస్తూ అడ్మిషన్లు చేపట్టాయని విమర్శించారు. వాటికి సంబంధించిన బిల్లు ఆమోదం పొందకుండా శ్రీనిధి, గురునానక్ పరీక్షలు షెడ్యూల్ ఇచ్చాయని తెలిపారు. ప్రభుత్వ అనుమతుల్లేకుండా రూ.లక్షల్లో ఫీజులు వసూళ్లు చేసి, విద్యార్థులను మోసం చేస్తున్న శ్రీనిధి, గురునానక్ ప్రయివేటు వర్సిటీలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మీనా ప్రింట్స్ నుంచి కొత్త 'అనంత' బ్రాండ్

హైదరాబాద్ : ఎస్‌వి గ్రూపు ఆఫ్ కంపెనీస్, లివా భాగస్వామ్యంతో మినా ప్రింట్స్ కొత్తగా 'అనంత' బ్రాండ్ చీరను ఆవిష్కరించినట్లు తెలిపింది. ఈ బ్రాండ్‌ను హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో విడుదల చేసినట్లు ఆ సంస్థ పేర్కొంది. దక్షిణాదిలో తొలుత అందుబాటులోకి తెచ్చిన ఈ బ్రాండ్‌ను.. ఆ తర్వాత దేశ వ్యాప్తంగా విస్తరించనున్నామని మీనా ప్రింట్స్ ఎండి భరత్ పేర్కొన్నారు.

ఉపాధ్యాయులే నిజమైన జాతి నిర్మాతలు

- మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్రరావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయులే నిజమైన జాతి నిర్మాతలని ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ ఆకెళ్ల రాఘవేంద్రరావు అన్నారు. గురువారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ బాలోత్సవం కమిటీ ఆధ్వర్యంలో టీచర్స్ వర్క్ షాప్ -2023 నిర్వహించారు. బాల సాహితీవేత్త చొక్కాపు వెంకటరమణ, ఎస్‌సిఇఆర్‌టి కరికులం కమిటీ సభ్యులు సిఎ ప్రసాద్, ఆకెళ్ల రాఘవేంద్రరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులది గౌరవప్రదమైన బాధ్యతాయుతమైన వృత్తి అని, విద్యార్థుల జీవితాన్ని సరైన దారిలో మలిచేది గురువులేనని అన్నారు. అధ్యాపకులకు నిరంతర అభ్యాసం ఎంతో ముఖ్యమని, జ్ఞానాన్ని పంచడంతోపాటు విజ్ఞానాన్ని పెంచుకుంటూ పిల్లలకు బోధించాలన్నారు. పిల్లలను ఆలోచించే వాళ్ళుగా తయారు చేయడం, మారుతున్న సిలబస్‌కు అనుగుణంగా అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమని సూచించారు. ప్రస్తుత పరిస్థితుల్లో పుట్టుకతోనే పిల్లలు టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నారని తెలిపారు. ఉపాధ్యాయులు కూడా మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోకపోతే కాలం వెనక్కి నెట్టివేస్తుందని చెప్పారు. విద్యార్థులకు సిలబస్‌తోపాటు సమాజంపై అవగాహన కలిగించేలా బోధించాలన్నారు. చదువుతోపాటు ఆట, పాట, ఇంగ్లీషు, తెలుగు భాషా పరిజ్ఞానం పెంచుకోవడానికి తగిన సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బాలోత్సవం అధ్యక్షులు భూపతి వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎన్.సోమయ్య, నాయకులు శాంతారావు, మమతా, రూప రుక్మిణి, సుజావతి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి కోసం రోడ్డెక్కిన రైతులు

- గ్రామాలను చుట్టుముట్టిన పోలీసులు
- పోలీసుల కళ్లుగప్పి రోడ్డుపై బైటాయించిన రైతులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం కొండపాక మండలం బందారం, దర్గా, అంకిరెడ్డిపల్లి గ్రామాలకు సాగునీరు అందించాలని కొన్నేండ్లుగా నాయకులు, అధికారులు, మంత్రి హరీశ్‌రావుకు మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోవడంతో గ్రామాల రైతులు మంగళవారం దుద్దెడ వేలికట్ట చౌరస్తాల్లో వేరువేరుగా రాస్తారోకో నిర్వహించారు. పోలీసులు రైతులను రోడ్డు ఎక్కకుండా భారీ పికెటింగ్ ఏర్పాటు చేశారు. పోలీసుల కళ్లుగప్పి రైతులు దుద్దెడకు చేరుకొని రోడ్డుపై బైటాయించారు. పోలీసులు రైతులను అరెస్టు చేసి త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఆలస్యంగా చేరుకున్న మరికొందరు రైతులు అరెస్టును నిరసిస్తూ కుక్కునూరు వెళ్లి చేర్యాల చౌరస్తా వద్ద నిరసన తెలిపారు. చేర్యాల చౌరస్తా వద్ద ధర్నా చేస్తున్న రైతులను పోలీసులు అరెస్టు చేసి కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ఎనిమిదేండ్ల నుంచి తపాసపల్లి రిజర్వాయర్ నుంచి నీరు అందిస్తామని ప్రభుత్వం హామీ ఇస్తూ ఎన్నికల సమయంలో ప్రజలను మభ్యపెట్టి, ఎన్నికల అనంతరం ఆ హామీని గాలికి వదిలేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తపాసపల్లి నుంచి మర్పడగ వరకు కాలువను తవ్వి వదిలేశారన్నారు. మూడేండ్ల కిందట కాలువ పనులు ప్రారంభించినప్పటికీ ఇప్పుడు ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని తెలిపారు. కొండపాక మండలంలో నిర్మించిన మల్లన్న సాగర్ నుంచి నీటిని అందిస్తామని నాయకులు ఎన్నోసార్లు చెప్పినా అమలు చేయడం లేదన్నారు. బందారం చుట్టుపక్కల గ్రామాలకు సాగునీరు అందిస్తున్నప్పటికీ ముఖ్యమంత్రి నియోజకవర్గంలోని మూడు గ్రామాలకు నీరు అందించకపోవడం ఏంటని ప్రశ్నించారు. అనంతరం అంకిరెడ్డిపల్లి మాజీ సర్పంచ్, ప్రస్తుత సర్పంచ్ భర్త బడెకోల్ నర్సింలు మాట్లాడుతూ.. అంకిరెడ్డిపల్లి, బందారం, దర్గా గ్రామాల నుంచి ముఖ్యమంత్రి కెసిఆర్‌కు భారీ మెజార్టీని అందించి రెండు పర్యాయాలు ముఖ్యమంత్రిగా ఎన్నుకున్నామని, ఏ ఎన్నికల్లో పిలుపునిచ్చినా ముందుండి ఓట్లు వేయించామన్నారు. రైతుల కోసం కాకుంటే ఇంకెవరి కోసం పని చేస్తారని, సాగునీరు అందించడానికి ఇంత సమయం పడుతుందా అని ప్రశ్నించారు. నాయకులు ఎప్పుడూ రైతుల వెంబడి ఉంటారని, నేను రైతుల వెంబడే ఉంటానంటూ రైతుల ధర్నాకు మద్దతు ప్రకటించారు.

కాంట్రాక్ట్ పారా మెడికల్ స్టాఫ్‌ను విధుల్లోకి తీసుకోవాలి

- ఆల్ ఇండియా రైల్వే కాంట్రాక్ట్ పారా మెడికల్ స్టాఫ్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశవ్యాప్తంగా రైల్వేలో తొలగించిన కాంట్రాక్ట్ పారామెడికల్ స్టాఫ్‌ను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ అధ్యక్షులు జె.కుమార్ స్వామి డిమాండ్ చేశారు. మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్ నిలయం ఎదుట ధర్నా నిర్వహించి అనంతరం జనరల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2005 నుంచి రైల్వేలో డైరెక్టుగా రిక్రూటైన, కోవిడ్ సమయంలో డైరెక్ట్‌గా రిక్రూటైన కాంట్రాక్ట్ పారామెడికల్ స్టాఫ్‌ను రైల్వే యాజమాన్యం విధుల్లో నుంచి తీసేయడం దుర్మార్గమన్నారు. తొలగించిన ఉద్యోగులందరినీ బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. రైల్వే పారామెడికల్ ఉద్యోగులకు నష్టం చేస్తున్న జిఇఎం పోర్టల్‌ను రద్దు చేయాలని, ఖాళీగా ఉన్న పారామెడికల్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని కోరారు. అలాగే గతంలో పనిచేసిన కాంట్రాక్టు పారామెడికల్ స్టాఫ్‌కు వెయిటేజీ ఇవ్వాలన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైప్‌లైన్‌ను వెంటనే రద్దు చేయాలని, రైల్వే ఆస్తుల ప్రయివేటీకరణ ఆపాలని, కేంద్ర ప్రభుత్వం, రైల్వే యాజమాన్యం దిగొచ్చి కాంట్రాక్ట్ పారామెడికల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఈ పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.అజయ్ బాబు, ఎం.అజయ్ బాబు షామిలి, కవిత, షామిలి పాల్గొన్నారు.